“ఇక్కడాపు. మరింత ముందుకు తీసుకెళ్ళకు?” అంది మనస్విని.

“ఏం అన్నాడు” మహదేవ్.

“హాస్టలో వాళ్ళెవరయినా చూస్తే బాగుండదు. నీకెన్నిసార్లు చెప్పినా వినిపించుకోవేం..... లోగొంతుకతో చిరుకోపంగా అందామె.

అతను బైకాపాడు. ఆమె దిగి “బై” అంటూ ముందుకి నడిచింది.

“అయిదు గంటలకి మర్చిపోకు” అంటూ తిరిగి వెనక్కి వెళ్ళిపోయాడు మహదేవ్.

* * * * *

సాయంత్రం అయిదు గంటలు!

మహదేవ్ హాస్టల్ రోడ్డులో వున్న ఓ చెట్టుకింద తన బైకాపి ఆమె కోసం ఎదురుచూస్తున్నాడు. క్షణాలు భారంగా గడుస్తున్నాయతనికి. ఏమీ తోచక ఆకాశంలోకి చూశాడతను. నిశ్శబ్దంగా సాగిపోతున్న జంట మేఘాలు ..... తనూ, మనస్వినిలా ..... తన ఆలోచనలకి తనకే నవ్వొచ్చిందతనికి, ఇంతలో మనస్విని వస్తూ కన్పించింది. ఆమె కదిలి వస్తుంటే పాపికొండల నడుమ సాగే ఒయ్యారాల గోదారిలా, గ్రీష్మారంభపు ప్రత్యూషంలా, నిండార విచ్చుకున్న అడవి మల్లెలా తోచింది అతడికి.

త్వరగా స్టార్ట్ చెయ్!” ఆమె మాటలతో ఇహ లోకంలోకి వచ్చి బైక్ స్టార్ట్ చేశాడు.

ఆమె అతని వెనక కూర్చుంది. బైక్ పుష్పక విమానంలా ముందుకు సాగిపోయింది.

“ఎక్కడికెళుతున్నాం?” అడిగిందామె.

“బిర్లామందిర్” చెప్పాడతను.

“ఉదయం నుంచీ ఏం చేశావ్” అడిగిందామె.

“నువ్వీ రోజు వస్తున్నావని ఉత్తరం రాశావ్ కదా! అందుకని ఈ రోజు పూర్తిగా సెలవ్ పెట్టేశాను. అయితే ఊర్నుంచి వచ్చి కూడా నాతో బయటికి రాకుండా హేండ్ ఇచ్చేశావ్.

చేసేదేం లేక ఇంటికెళ్ళి శుభ్రంగా పడుకున్నాను. అదీ ఒకందుకు మంచిదే అయిందిలే .....”

“ఏం” అన్నది మనస్విని.

బాగా నిద్రపోయి లేవటంతో గ్లామర్ పెరిగింది చూడు నా వంక” అన్నాడు మహదేవ్.

“చూశానులే! జాగ్రత్తగా డ్రైవ్‌చేయి. లేకపోతే ఏ వాహనమో గుద్దేసి వున్న గ్లామర్ కాస్త డీ గ్లామరైపోతుంది” అతన్ని వుడికిస్తూ అందామె.

బిర్లామందిర్ చేరుకుని, బైక్ లాక్ చేసి మెట్లెక్కి లోపలకు నడిచారు. ఆ రోజు జనం పెద్దగా లేరు. ఇద్దరూ ఓ మూల మెట్ల దగ్గర కూర్చున్నారు.

“ఊఁ ..... చెప్పు ఈ పదిహేనురోజుల విశేషాలు.”

“ఏమున్నాయి నథింగ్. తినటం ఆఫీసుకి పోవటం, తిరిగిరావటం, మళ్ళీ తినటం, పడుకోవటం ..... మనసు మాత్రం సముద్ర కెరటాలతో పోటీ పడుతూ నా హృదయంలో నీ

జ్ఞాపకాలని కెలికేవి. రాత్రున్న నిద్రపట్టక బిల్డింగ్ ప్లాన్స్ గీద్దామనుకుంటే కళ్ళముందు నువ్వే కనిపించేదానివి. నీ సాన్నిహిత్యపు వెచ్చదనం అనుభవంలోకి వచ్చీరాకముందే నువు లేవన్న నిజం శీతలం నీటిని గడ్డకట్టించేసినట్లు నా మనసును ఘనీభవించేసిపోయేది. దాంతో గుబులురేగి నీమీద చెప్పలేనంత కోపం వచ్చింది. అయినా తమాయించుకునేవాడిని. ఎందుకంటే నువ్వే నేను కదా!"

అతని మాటలకి సంతోషించినా పైకి మాత్రం "మాటలు బాగా నేర్చావ్" అందంగా కోప్పడింది.

"ఈ పదిహేను రోజులలోనూ నీకు నేను గుర్తురాలేదా?" ఆర్తిగా ఆమెని అడిగాడతను.

"అదేం ప్రశ్న?"

"మరి నేను ఇన్ని చెబుతున్నా నువ్వొక్క మాట మాట్లాడవేం?" నిష్టూరంగా అన్నాడతను.

"ఎందుకు గుర్తురావు? అసలు మరచిపోతే కదా గుర్తురావటం, రాకపోవటాల గురించి చెప్పగలం."

"అంటే?" అన్నాడు మహదేవ్.

"అంటే ..... ప్రతీ క్షణం గుర్తున్నావని అర్థం. మనం జీవించి వున్నంతకాలం ఉచ్ఛ్వాస, నిశ్వాసలు ఆగక ఎలా సాగుతామో అలాగే నిర్విరామంగా నీ తలపులు నా మది గదిలో కదలాడుతూనే వుంటాయి" అన్నది మనస్విని.

ఆమె మాటలకి అతని కళ్ళల్లో గ్రీష్మారంభపు సూర్యుని కాంతులు!

"మనస్విని!"

"ఊఁ ..... !"

"నువ్వు ..... నువ్వంటే నాకు ప్రాణం! ఎందుకని?" అడిగాడు మహదేవ్.

'నువ్వే చెప్పు' అన్నట్టుగా చూసింది ఆమె.

"ఏం చెప్పను? ఆర్తితో అనురాగాన్ని పంచావనా? ప్రేమగా నా తలలోకి వేళ్ళు జొనిపి లాలించావనా? ఆ ఆనంద విషాదాలలో పాలుపంచుకుంటావనా?నాలో ఆద్యంతాలు నువ్వే అవుతావనా?

ఏమో ..... నీపై నా ఇష్టానికి కారణం నాకే తెలియదు. కానీ నువ్వంటే ప్రాణం. నాలో సగభాగం అంతే ..... "

ఆమె మౌనంగా అతని మాటలు వింటూ అందులోని అనురాగపు వెచ్చదనంలో చలికాచుకుంటున్నట్టు సంతోషాన్ని అనుభవించసాగింది.

అలా ఎంత సేపున్నారో వాళ్ళకే తెలియలేదు. ఆ ఇద్దరిలో ముందుగా బాహ్య ప్రపంచంలోకి వచ్చింది మనస్వినే!

"అమ్మో! ఎంత చీకటైపోయిందో" అంది కంగారుగా.

"చీకటెక్కడ? పైన చూడు ..... చంద్రుడు వెండి వెలుగులు కురిపిస్తుంటే" అన్నాడు అతను.

"అదే చాల టైమైపోయిందని ..... " రిస్ట్ వాచ్ వంక చూసుకుంటూ అందామె.

"ఎంతయింది టైం?" అడిగాడు అతను.

"ఏడున్నర! ఇక పోదాం."

"అప్పుడేనా?" విచారంగా ముఖం పెట్టి అన్నాడు మహదేవ్.

"అవును."

"ఇంకో అరగంట ..... ప్లీజ్! పదిహేను రోజుల తర్వాత కలిశాం. మర్చిపోతున్నావా?" అన్నాడు.

"మర్చిపోలేదు ప్రభూ ..... పదిహేను రోజులు, పదిహేను రోజులంటూ ఉదయం నుంచీ బుర్ర తింటున్నావ్ ..... "

"ఇక అనునులే. మరో అరగంట వుంటావ్‌గా ..... " అన్నాడు మహదేవ్.

"తప్పకుండా!"

"గుడ్ గాళ్"

ఆమె వెళ్ళిపోతాననగానే మబ్బుల మాటుకు మాయమైపోయిన చంద్రుడు ఆమె మనసు మార్చుకోగానే మబ్బుల్ని ఛేదించుకుని మళ్ళీ బయటపడ్డాడు.

"వైజాగ్‌లో ఏమేం చేశావు?"

"ఏం చేస్తాను ..... ? ప్రత్యేకించి చేయవలసిన పనులేం వున్నాయి అక్కడ?"

"ఏం చేశావంటే ఎలా గడిపావని?"

"ఓ నాలుగు రోజులు శుభ్రంగా ఇంటి పట్టునే రెస్ట్ తీసుకున్నాను. తరువాత ఫ్రెండ్స్‌ని కలుసుకున్నాను. మా చెల్లీ, తమ్ముళ్ళతో బీచ్ కెళ్ళాను. ఒకసారి ఇంట్లో వాళ్ళందరం కలసి భీమ్లీ వెళ్ళాం. తరువాత వచ్చేసేవరకూ రొటీనే. ఉదయం లేవడం స్నానపానాలు చేయడం. పేపర్ చూడటం, తినడం, పడుకోవడం బద్ధకంగానే రోజులు గడిచాయి.

ఇక్కడా అదే రొటినే. ఉదయం లేవడం, ఆదరా బాదరాగా తయారవడం, బస్సుల కోసం ఉరుకులు పరుగులు, ఆఫీసు పని, సాయంత్రం మళ్ళీ బస్సుల కోసం రన్నింగ్‌రేస్. కిక్కిరిసిన జనాల మధ్య ప్రయాణం చేసి రూమ్‌కి చేరుకోవడం, ఫ్రెషయి కాస్సేపు ఏవయినా బుక్స్ చదవటం, తినటం, పడుకోవటం ..... నిజంగా నువ్వు పరిచయం కాకపోయుంటే అమ్మా నాన్నలని, ఇంటినీ వదిలి వచ్చి ఇన్నేళ్ళు ఇక్కడ పని చేసే దాన్నే కాదు ..... " అందామె.

"ఇకమీదట రొటీన్ అనే మాట వుండదు మన జీవితాల్లో" అన్నాడతను.

"ఎలా?" అడిగింది మనస్విని.

"ఇలా" అంటూ ఆమె మెడలో తాళికడుతున్నట్టు రెండు చేతులతో సైగచేసి, "నేను వెంటనే మా అమ్మకి మన విషయం చెప్పి, పెళ్ళికి ఏర్పాట్లు చేస్తాను! ఎంత తొందరగా

వీలయితే అంత తొందరగా నిన్ను నాదాన్ని చేసుకుంటాను” అన్నాడు మహదేవ్.

*          *          *          *          *

ఆ రోజు రోజుకంటే పెందలాడే భోజనాలు ముగించి అభిరాం, వరప్రసాదం. అభిరాం గదికి చేరుకున్నారు. వరప్రసాదం చెప్పబోయే విశేషాల కోసం ఆత్రుతగా ఎదురుచూడసాగాడు అభిరాం.

అప్పుడు సమయం రాత్రి ఎనిమిది గంటలైంది.

వరప్రసాదం డబ్బాలోంచి నశ్యంతీసి ఘాటుగా పీల్చాడు. వరుసగా నాలుగైదుసార్లు తుమ్మి ఆ తర్వాత చెప్పసాగాడు--

“హిమాలయాలలో నాలుగువేల అడుగుల ఎత్తున ఓక్, పైన్, దేవదారు చెట్లు పెరుగుతాయి. ఇంకా ఎత్తున భోజవత్తి పెరుగుతుంది. అది అక్కడి గ్రామీణులకు అవసరమైన కాగితం బెరడును ఇస్తుంది. అక్కడి వారికి వనమూలికల గురించి బాగా తెలుసు. వారు దీర్ఘాయుష్కులు.

పాకిస్తాన్ హిమాలయాలలో ‘హున్ జా’ అనే తెగ ప్రజలున్నారు. వీరు మాంసాహారులు.

మన ప్రాంతం హిమాలయవాసుల హంసజాతి వారు, శాకాహారులు, హంసకు పాలు, నీరు వేరుచేసే శక్తి వున్నదని అంటారు. అలా వీరు లోకంలో మంచిని, చెడును రెంటినీ వేరుచేసి చూడగలరు.

ఈ పర్వతాల మొత్తం మీద ‘శక్తి’ ఆరాధన ఎక్కువ. ఇక్కడ ఋషులను ఆదరిస్తారు. వారికి ఆహారం, బస మొదలైన సౌకర్యాలను ప్రజలే కల్పిస్తారు.

ఎవరైనా, ఎక్కడివారైనా సాధువులను ఆదరించడం అనేది అక్కడివారి సంప్రదాయం.

హిమాలయాలలో పలురకాల సంస్కృతులున్నా, ఎవరి పద్ధతి వారిదే. ఎవరూ మరొకరికి అడ్డంరారు. సుమారు వెయ్యేళ్ళ క్రితం వేలాదిగా టిబెటన్‌లు, చైనీయులు మన దేశం నుండి బౌద్ధసాహిత్యం తీసుకొని వెళ్ళారు.

దాంతో వారి సంస్కృతిని సుసంపన్నం చేసుకున్నారు. మన ధ్యాన పద్దతులు జపాన్ దాకా వెళ్ళాయి. భారతీయ గురువులు కొందరు అక్కడి వారికి బోధలు చేశారు.”

“అవునూ! హిమాలయాలలో యెతి వున్నదని అంటారు. నిజమేనా?” వరప్రసాదం మాటల మధ్యలో అడ్డు వస్తూ అడిగాడు అభిరాం.

“ఇది పాశ్చాత్యులు పుట్టించిన పుకారు. యెతి గురించి ఎన్నో కథలు ప్రచారంలో వున్నాయి. ఇంగ్లీషువారు ‘షెర్పాల’నే కొండజాతి ప్రజల సాయంతో యెతికోసం అన్వేషణ సాగించారు.

షెర్పాలకు హిమాలయాల్లో ఎక్కడేముందో తెలుసు. అంతేతప్ప అక్కడి ఆధ్యాత్మిక సంప్రదాయం గురించి తెలియదు. నిజానికి యెతి అంటూ ఏమీలేదు. యెతి వున్నదన్న కట్టుకథకు మూలం హిమాలయాలలోని రెండు ఆశ్రమ గుహలు.

వీటిని గురించి మన పురాణ ఇతిహాసాలలో వుంది. వీటికి మంచి సంప్రదాయం, ధ్యాన పరంపర వున్నాయి. ఈ గుహలలో ఒకటి కాంచన గంగపై వుంది. ఇది పధ్నాలుగు వేల అడుగుల ఎత్తున వుంది.

రెండవది టిబెట్, ఘర్‌వాల్ సరిహద్దులలో పన్నెండువేల అడుగుల ఎత్తున వుంది. ఈ గుహలలో సంస్కృత, టిబెటిన్, సంధ్యాభాషల రాతప్రతులు ఈనాటికీ వున్నాయంటారు.

ఈ గుహల సమీపంలోనే తెల్లని ఎలుగుబంట్లు సంచరించడం కొందరు ఆంగ్లేయులు చూసి, వాటిని సమీపించే సమయానికి అవి కనపడకుండా పోయాయట. ఏటి పాదాలు చాలా పెద్దవి. అడుగులు మనిషి అడుగుల మాదిరే వుంటాయి.

దూరంనుంచి అస్పష్టంగా వుండటంవల్ల మంచుమనిషిలాగా అగుపించి హిమాలయాలలో యెతి (ఆంగ్లేయులు దీన్ని షాంగ్రిలా అని సంబోధిస్తారు) వున్నదని ప్రచారం జరిగిపోయింది.

నిజానికి 'యతి' అనేది శంకరాచార్య సంప్రదాయం. సన్యాసులను ఉద్దేశించి వాడే పదం.

మంత్రమంటే ఏమిటో నాకు తెలిసింది హిమాలయాలలోనే. మంత్రమంటే మామూలు మనుషుల భాషనుంచి వచ్చినది కాదు. నిశ్చలమైన, తీవ్రమైన ధ్యానంలో మహర్షులు కనిపెట్టిన కొన్ని పదాలు, అక్షరాలు, శబ్దాలు కలసి ఏర్పడినవే. అవి అంతశ్చేతన నుండి వచ్చిన నాదాలు.

సాధకుని పైపైకి తీసుకువెళ్ళి ఆఖరికి పరిపూర్ణుడైన యోగిగా మార్చి, అనంతానంతమైన నిశ్శబ్దంలోకి పంపుతాయి. మంత్రాల గురించి జ్ఞానం పెరిగేకొద్దీ కొత్త అర్థాలు స్ఫురిస్తాయి. చైతన్యంలో వున్న స్థితుల గురించి తెలుస్తుంది. మనిషికున్నట్లే మంత్రాలకి కూడా కొన్ని కవచాలున్నాయి.

ఉదాహరణకు 'ఓంకార' మంత్రం తీసుకుంటే గనుక ఇందులోని ఆ,ఉ, మ అనే మూడు అక్షరాలు మెలకువ, కలలు కనడం, నిద్రపోవడం అనే మూడు దశలకు సంకేతంగా వున్నాయి. ఇవే సూక్ష్మ, స్థూల, కారణ దేహాలకు చిహ్నాలు. వీటిని దాటిన నాలుగవ దశ (తురీయస్థితి)లో మంత్రానికి ఒక రూపం లేదు. నాదంలేదు. అది వర్ణనాతీరం.

లయయోగం (స్వేదనం) గురించి తెలిసినవారికి ఈ నాలుగో దశ సిద్ధిస్తుంది. ప్రార్థనా రూపాలలో అత్యంత శక్తివంతమైనది, పొందికైనది, ప్రముఖమైనది మంత్రమే. చక్కగా గుర్తుంచుకుంటే అది దారి చూపుతుంది.